క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ట్రాన్స్‌కోలో నూతనంగా ఇద్దరు అధికారులు బాధ్యతలు స్వీకరించారు. స్థానిక అర్బన్ డివిజన్ కార్యాలయంలో సాంకేతిక విభాగం ఈఈ జగదీష్, పీఓగా రెడ్డెప్ప చేరారు. అనంతరం ఎస్ఈ సురేంద్రనాయుడును రూరల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

తవణంపల్లె: మండలంలోని 32 పంచాయతీల్లో ఉన్న ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు 15, 16 తేదీల్లో ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా రెడ్డిబాబు



తవణంపల్లె: ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రెడ్డిబాబు సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంపీడీఓగా పని చేసిన అబ్దుల్‌కలాం ఆజాద్ పెద్దతిప్పసముద్రానికి బదిలీపై వెళ్లారు. దీంతో పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ ఏఓ రెడ్డిబాబు ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పలువురు పంచాయతీ కార్యదర్శులు శాలువలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

బంగారుపాళెంలో వర్షం



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం

బంగారుపాళెం: అల్పపీడనం ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు చిరుజల్లులు కురిశాయి. దీంతో రహదారుల పక్కన చిన్న చిన్న వ్యాపారాలు సాగించుకునే చిరువ్యాపారులు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, ఇతర పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ హెచ్చరించారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 15 మంది ఎంపిక



రోగులకు పరీక్ష చేస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 15 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన 32 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 15 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వీళ్లు మారరు.. అంతే!



వెంగళరావు కాలనీ వద్ద రోడ్డుపై పోసిన కాలువ వ్యర్థాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో కొందరు అధికారులకు మురికివాడలంటేనే చిన్నచూపు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలువల్లో పూడికలు తీయించాలని కమిషనర్ ఆదేశించారు. పూడికను తీసేటప్పుడే ఓ ట్రాక్టర్‌లో మొత్తం వ్యర్థాలను తీసుకెళ్లిపోతే ఒకేసారి పనిపూర్తవుతుంది. కానీ అలా చేస్తే సిబ్బందికి మామూళ్లు ముట్టదనుకున్నారో ఏమో? కాలువ వ్యర్థాలన్నింటినీ రోడ్డుపై పడేస్తున్నారు. 8వ డివిజన్‌లోని వెంగళరావు కాలనీలో ఇదే పనిచేశారు. ఒకేసారి మొత్తం తీసేస్తే ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెట్టడం సాధ్యం కాదనుకున్న అధికారులు.. ఇలా పనిని రెండు మార్లు పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. కాలువ వ్యర్థాలను రోడ్డుపై వేయడానికి ఓ బిల్లు, దాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్లడానికి మరో బిల్లు పెట్టాలని ఇలా చేస్తున్నారు. పైగా కాలువ వ్యర్థాలు మరో వారం పాటు రోడ్డుపై ఇలాగే వదిలేస్తే మురికివాడలు మరింత మురికిగా తయారవుతాయనే విషయం తెలిసినా అధికారులు నిర్లక్ష్యం వీడడంలేదు.

దోమ కాటు.. పశువులకు చేటు



పాడి ఆవుకు వైద్యం చేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయ సిబ్బంది

- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- దోమకాటుతో పాల ఉత్పత్తి తగ్గుముఖం
- దోమల కట్టడికి చర్యలు తప్పనిసరి

ఐరాల: వర్షాకాలంలో మనుషులే కాదు పశువులు కూడా దోమకాటుకు గురవుతున్నాయి. దోమకాటు వల్ల పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీనిని ముందుగా అరికడితే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల పశువులు రోగాల బారిన పడడం కాకుండా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోందని ఐరాల మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి సూచిస్తున్నారు.

పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

నియోజకవర్గంలో అధికశాతం రైతులు పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ తరుణంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడి పశువులకు గొంతు వాపు వ్యాధి, దొమ్మ వ్యాధి, గాలికుంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని పశువైద్యాధికారి సూచిస్తున్నారు. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చే జబ్బు గొంతువాపు వ్యాధి. దీనిని గురకవ్యాధి అనికూడా అంటారు. వర్షాకాలంలో పశువులకు దోమలు, సూక్ష్మ జీవుల వలన వస్తుంది. ఇది అంటువ్యాధిగా ఇతర పశువులకు వ్యాప్తి చెందుతుంది. కలుషితమైన నీరు, మేత ద్వారా రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధి బారిన పడి కంటి నుంచి నీరు, నోటి నుంచి చొంగకారస్తూ, గురక, శ్వాస పీల్చడం కష్టతరంగా మారుతుంది. పశువు ఆయాస పడుతూ శ్వాస పీల్చడం ఇబ్బందిపడుతుంది. జ్వరం తీవ్రత 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. గొంతు కిందకు నీరు చేరి గొంతువాపు వస్తుంది.

టీకాలు వేయించాలి

వర్షాకాలం ముందుగా జూన్, జూలైలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేసుకోవాలి. వ్యాధి సోకిన పశువుకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు ఇంజక్షన్లు ఇవ్వాలి. మిగిలిన పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సమీప పశువుల వైద్యాధికారిని సంప్రదించి తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలి.

గాలికుంటు వ్యాధి

గాలికుంటు వ్యాధి దోమకాటు, వైరస్ సోకడం లేదా కలుషితమైన గాలి ద్వారా వచ్చే వ్యాధి. తల్లిపాల ద్వారా దూడలకు వస్తుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో విరివిగా పశువులకు గాలికుంటువ్యాధి సోకుతుంది. గిట్టలు ఉన్న ప్రతి జీవి ఈ అంటువ్యాధి బారిన పడతాయి. వ్యాధి సోకిన సమయంలో పశువుకు 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. నోటిలో, గిట్ల మధ్య పుండ్లు పడి పశువులు నడవలేని పరిస్థితిని ఎదుర్కొంటాయి. మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఈ వ్యాధి పశువులకు వచ్చే ప్రమాదం ఉంది. ఈ వ్యాధి సోకిన పశువుకు గిట్ట మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారి నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం చేత పశువులు మేత మేయలేక పోతాయి. నీరసంగా ఉంటాయి. వర్షాకాలంలో నేలలు తడిగా ఉండడం వల్ల గాలికుంటు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వల్ల పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఎద్దుల్లో అయితే రోగ నిరోధకశక్తి తగ్గి అలసటకు గురై నీరసించిపోతాయి.

చికిత్స

వ్యాధి సోకిన పవువును మంద నుంచి ముందుగా వేరుచేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పరమాంగనెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె పూయాలి. యాంటిబయోటిక్స్, పెయిన్‌కిల్లర్స్ వాడితే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్లలో కట్టేసిన తరువాత దోమ తెరలకు రంధ్రాలు లేకుండా చూడాలి. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టేముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల కొట్టం చుట్టూ గుబురు పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజు శుభ్రం చేసుకోవడంతో పాటు చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

దోమకాటుతో సమస్యలు

పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో మేత సరిగా తీసుకపోవడంతో పాటు ఆకలి మందగించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుంది. పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజు రోజుకూ బలహీనపడుతుంది. దోమలు కుట్టిన చోట చర్మం దురద వచ్చి పుండ్లు పడతాయి. పశువులకు మేత వేసే ప్రాంతం శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోదు.

పశువు ప్రాణానికే ప్రమాదం



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల దోమలు పెరిగి వ్యాధులు వ్యాపిస్తాయి. దోమల వల్ల పశువులకు జ్వరం, అలర్జీ అధికంగా వస్తాయి. దీని వల్ల పాల దిగుబడిపై చూపడమే కాకుండా పశుప్రాణాలను హరిస్తాయి. దోమల వల్ల ఎలాంటి నష్టం సరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– పద్మావతి, పశుసంవర్ధక శాఖ ఏడీ, ఐరాల

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం







ఐరాల : సేవలందిస్తున్న వైద్య సిబ్బంది, తవణంపల్లె: మహిళకు వైద్యం చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ, గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

ఐరాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకలలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. పండ్ల రసం, గుడ్లు, తాజా ఆకుకూరలు, కూరగాయలు విధిగా ఆహారంలో ఉండేలా చూసుకోవాలని తెలిపారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

సీజనల్ వ్యాధుల పట్ల గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. దివిటివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం చేయవచ్చని చెప్పారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు ఉన్నచోటా దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కాచి చలార్చి నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లె, ఉప్పాంక, తడకర, పల్లెచెరువు గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 మొబైల్ క్లినిక్ ద్వారా గర్భిణులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ప్రజలకు వివరించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాంచి చల్లార్చిన నీటిని తాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

గుడిపాల: గర్భిణులపై ప్రత్యేకంగా దృష్టి సారించి వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని 197రామాపురం, చీలాపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యసిబ్బంది వారి ఇంటివద్దకు వెళ్లి వారికి కావలసిన సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. వర్షాలు పడుతుండడంతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, అంటువ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది దివ్య, సరస్వతి, శశి, అశ్విని, శిరీషా, ఉమామహేశ్వరి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వెంగంపల్లెలో దారి సమస్య పరిష్కారం



వెంగంపల్లె వద్ద వివాదాస్పదమైన దారిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో వివాదాస్పదమైన దారి సమస్యను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయించి పరిష్కరించారు. వెంగంపల్లె, పరిసరాల గ్రామాల ప్రజలు సమీపంలోని పెద్ద అడవిలో పైభాగాన వెంకటేశ్వర స్వామి గుడిని నిర్మించారు. ప్రతి సంవత్సరం ఐదవ శనివారం వెంకటేశ్వరస్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. గుడికి వెళ్లడానికి దారి ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దారికి ఇరువైపులా ఆక్రమించుకొన్న రైతులతో మాట్లాడి దారి వదలాలని సూచించారు. రైతులు సహకరించడంతో సర్వే చేయించి 35 అడుగుల వెడల్పుతో దారి ఏర్పాటు చేయించారు.

అసలే స్కూటీ.. నలుగురు ఎక్కారేంటి?



అసలే అది బుల్లి స్కూటీ. ఇద్దరు ఎక్కితేనే కష్టం. అలాంటిది నలుగురు ఎక్కారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై లారీలు అధిక వేగంతో వెళుతుంటాయి.ఆ మార్గంలో డ్రైవింగ్ చేయడమే ఒక సాహసం. అలాంటిది మైనారిటీ కూడా తీరని బాలుడు మరో ముగ్గురిని వెనక కూర్చోపెట్టి ప్రయాణించాడు. నిత్యం వేగంగా వాహనాలు దూసుకెళ్లే హైవేలో ఇలా వెళ్లడం అత్యంత ప్రమాదకరమే. నంబర్ ప్లేట్ లేని ఈ స్కూటీపై ఎలా దూసుకుపోతున్నారో చూడండి.

– గుడిపాల

సచివాలయాల్లో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు



మెడికల్ క్యాంపుపై సచివాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుడిపాల: తుపాను నేపథ్యంలో మెడికల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సంధ్య తెలిపారు. వర్షాలు అధికంగా ఉండడం వలన ప్రతి ఒక్కరినీ అప్రమత్తం చేశామన్నారు. సోమవారం పాపసముద్రం, గుడిపాల సచివాలయాల పరిధిలో ముందస్తుగా వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రతి సచివాలయంలోనూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్ సంధ్య 87900 33456, హెల్త్ అసిస్టెంట్ 98496 64426, స్టాఫ్ నర్సులు 95502 79579, 99080 13900, 99850 99854ను సంప్రదించాలన్నారు.

అద్దె భవనం.. అగచాట్లు ఖాయం

- ఒకే భవనంలో రెండు కార్యాలయాలు
- దీర్ఘకాల పాలన కష్టతరమే
- నేడు నూతన ఎస్ఈ బాధ్యతలు స్వీకరణ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పాలన మొన్నటివరకు తిరుపతి కేంద్రంగా సాగుతుండేది. పరిపాలన సౌలభ్యం కోసమని చిత్తూరు జిల్లాకు ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఓడీ (ఎస్ఈ) గా ఇస్మాయిల్ అహ్మద్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఆయనతోపాటు అనుబంధ విభాగాల అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. రూరల్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం నూతన అధికారులు పాలన ప్రారంభించనున్నారు. అద్దె భవనం దొరికే వరకు ఒకే భవనంలో రూరల్ డివిజన్, సర్కిల్(జిల్లా) కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

అంతమందికీ ఒకే భవనం

ప్రస్తుతం ఉన్న పోస్టులను కుదించి కార్పొరేట్, ఎస్ఈ, డివిజన్ల కార్యాలయాల నుంచి ఉద్యోగులను 55 మందిని సర్దుబాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఎస్ఈ, 3 ఈఈలు, 1 ఎస్ఏఓ, 1 ఎస్ఏఓ, 1 పీఓ, 6 డీఈలు, 12 ఏఈలు, 4 జేఈలు, 11 సీనియర్ సహాయకులు, 9 జూనియర్ సహాయకులను సర్దుబాటు చేయనున్నారు. వీరందరూ రూరల్ డివిజన్ కార్యాలయం నుంచి పాలన సాగించనున్నారు. తద్వారా ఇక్కడ పనిచేస్తున్న 30 ఉద్యోగులతో పాటు అదనంగా 55 మంది ఉద్యోగులకు ఈ ఒకే కార్యాలయ భవనమే ఉంది. అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఎస్ఈ కార్యాలయంలో పెట్టాలంటే ఇందులో ఉపకార్యాలయాలు అధికంగా ఉన్నాయి. దీనికి తోడు అధికారుల కార్లు పార్కింగ్ చేయడానికి స్థలం కూడా చాలదు. దీంతో ఏకైక ప్రత్యామ్నాయం రూరల్ డివిజన్ కార్యాలయమే. ఇక్కడ ఒకే కార్యాలయం ఉండడం, కార్ పార్కింగ్ స్థలం కాస్త విశాలంగానూ ఉంది. దీనికి తోడు అర్బన్ కార్యాలయం మినహాయించి, ఎస్‌పీఎం, ఎంఅండ్‌పీ, జిల్లాస్టోర్స్ అన్నీ ఒకే ప్రాంతంలో ఉన్నాయి. అందుకే ఇక్కడ ఎస్ఈ కార్యాలయం పెట్టనున్నారు. అయితే ప్రస్తుత పనిచేస్తున్న ఉద్యోగులకే అక్కడ స్థలం చాలక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటప్పుడు కేడర్ల వారీగా మౌలిక వసతులైన చాంబర్స్, క్యాబిన్స్, టేబుల్స్, కంప్యూటర్లు, ప్రింటర్స్, స్టేషనరీ, ఫైల్స్ పెట్టుకోవడం ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

అంతా గందరగోళం

ఇప్పుడు అద్దెభవనం వెతికే పనిలో ఉద్యోగులు పడ్డారు. అలా దొరకని పక్షంలో ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీ కోసం కలెక్టరేట్, ఇతర ప్రాంతాల్లో చూస్తున్నారు. అద్దె భవనం దొరికి వాటిని ఎస్ఈలు ఆమోదిస్తే అక్కడ రూరల్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తదుపరి పాత ఎస్‌పీఎం ఉన్న ప్రాంతంలో ఎస్ఈ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసుకోవాల్సి ఉంది. తదుపరి పనులు పూర్తి చేశాక, ఎస్ఈ కార్యాలయం అక్కడకు మార్పు జరుగుతుంది. ఈ క్రమంలో సెక్షన్లు, డివిజన్ల విభజన, కలయిక పూర్తి చేయాల్సి ఉంది.

అద్దె భవనంలో సేవలు



రూరల్ డివిజన్ కార్యాలయం నుంచి ఎస్ఈ కార్యాలయం సేవలు అందిస్తారు. డివిజన్ కార్యాలయం కోసం ఈ ప్రాంతంలోనే అద్దె భవనం చూడాలని అధికారులను ఆదేశించం. కొత్త ఎస్ఈ వచ్చాక ఇద్దరం కలిసి భవనాన్ని నిర్ణయిస్తాం. క్వార్టర్స్‌లో అనుబంధంగా ఉన్న ఈఈ కార్యాలయాలను ఒకే భవనంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాం. భవిష్యత్‌లో ఎస్‌పీఎం కార్యాలయంలో ఎస్ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. అలాగే రూరల్ కార్యాలయంపై మరో అంతస్తును నిర్మించనున్నాం.

– సురేంద్రనాయుడు, ఎస్ఈ, ట్రాన్స్‌కో



రూరల్ డివిజన్ కార్యాలయ ప్రవేశం



రూరల్ డివిజన్ కార్యాలయం

చిత్తూరులో తుపాను అత్యవసర విభాగం



వర్షపు నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో చిత్తూరు నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్పొరేషన్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఇప్పటికే నగరంలో లోతట్టు ప్రాంతాలు, పెద్ద కాలువల్లో ఉన్న ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించారు. ఆయన సోమవారం మిట్టూరు, గంగినేని చెరువు మొరవ కాలువను పరిశీలించారు. కాలువలో అడ్డంకులు తొలగించాలని, ఆక్రమణలు తొలగించేలా సంబంధిత వ్యక్తులకు సత్వరం నోటీసు జారీ చేయాలని ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో ముగ్గురు అధికారులు, మరో ముగ్గురు సహాయకులను నియమించి, 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా ఏమైనా అత్యవసర పరిస్థితులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ 98499 07885కు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాల సమయంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలు, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించడానికి వీలుగా సహాయక ఇంజనీర్, ఆరోగ్యాధికారి, ఏసీపీ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. వర్షాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అత్యవసర సమయాల్లో తగిన సహాయ సహకారాలు అందించాలని రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అగ్నిమాపక శాఖ అధికారులను కోరారు. కార్యాలయంలోనూ మేనేజర్, ఆర్ఓ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐలతో కూడిన హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశారు. వార్డు స్థాయిలో వార్డు కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం, ఏఈలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు ఉన్నారు.